# డింభకుడు

**- బులుసు - జీ - ప్రకాష్**

**క్షీరాబ్ధిశయనం ఆరోక్లాసు మొదలుకొని బీకామ్ పాసయ్యే వరకూ వారాలబ్బాయిగానే జీవిత నౌకని నెట్టుకొచ్చాడు. తండ్రి కాలం చేసిన తరువాత తల్లి కొన్ని ఇళ్లల్లో వంటపనులు చేసుకుంటూ క్షీరాబ్ధిశయనాన్ని సాకుతూ వచ్చింది. ఇప్పుడు కొడుకు చదువు పూర్తయేక కూడా అన్నం పెట్టమంటే ఎవ్వరూ పెట్టరు. కొత్త వారాలబ్బాయికి అవకాశం ఇస్తారు.**

క్షీరాబ్ధిశయనం నాలుగైదు దుకాణాల్లో ఎక్కౌంట్లు రాయడానికి కుదిరేడు. తలో రెండొందలూ ఇస్తున్నారు. వాటితో ఎలాగో కాలక్షేపం చేస్తూ ఉద్యోగ సంపాదనార్థం పోటీ పరీక్షలు రాస్తున్నాడు. ఓ ధర్మాత్ముడెవరో తన బంగాళా ఔట్‌హౌస్‌లో ఉచితంగా వుండడానికి అవకాశం ఇచ్చాడు. అటువంటి ధర్మాత్ములు కొద్దిమందైనా వుండబట్టే 'త్రుటిలో తప్పిన ఘోరప్రమాదం'లాంటి వార్తలు చదువుతుంటాము.

క్షీరాబ్ధిశయనం చదువు పూర్తయ్యేవరకూ వారం వారం భోజనం పెట్టేవాళ్లలో కమఠనాధంగారొకరు. క్షీరాబ్ధిశయనానికి ఆరో క్లాసులో వారం ఇచ్చేనాటికి కమఠనాధంగారు అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో వుండేవారు. వారాలబ్బాయి బీకాం పూర్తయ్యేసరికి డైరెక్టర్ హోదాకి ఎదిగి పోయారు. నిరుద్యోగులకు ఉద్యోగం వేయించే శక్తివంతమైన ఉద్యోగం కమఠనాధం గారిని వరించింది.

ఒకనాటి రాత్రి కమఠనాధంగారి భోజనానంతరం పందిరి మంచంమీద తమలపాకుల చిలకలు తినిపిస్తూ అతని సతీమణి అంది ''ఏవండీ! మనింట్లో పదేళ్లపాటు వారం వారం భోజనం చేసిన క్షీరాబ్ధిశయనం జ్ఞాపకం వున్నాడా?'' అని.

''లేకేం! అబ్బాయి చాలా బుద్ధిమంతుడు'' అన్నారు కమఠనాధంగారు.

''మీ ఆఫీసులో ఏదో గుమస్తా ఉద్యోగం ఖాళీ వుందిట. అందులో వెయ్యకూడదుటండీ?'' అంది అర్ధాంగి.

''కూడదని ఎవరన్నారు? ఐతే మనకేంటి లాభం?''

''ఎవరికైనా ఉపకారం చేస్తే లాభనష్టాలు బేరీజు వేయడవేనేంటండీ మీ పని? మన అమ్మాయి సరసిజం అన్నాదండీ! అమ్మా ఆ క్షీరాబ్ధిశయనానికి ఏదైనా ఉద్యోగం ఇప్పించి నాన్నగార్ని పుణ్యం కట్టుకోమనవే అని''

''మనమ్మాయి సరసిజం అందా? దానికేంటి ఇంటరెస్టు?'' ప్రశ్నించారు కమఠనాధంగారు.

''వడ్డీ వ్యాపారం ఏమిటండీ ఇంటరెస్టు ఇంటరెస్టు అంటారు? మీకెంతసేపూ ఆఫీస కాయితాలూ గొడవాను. సరసిజం ఇంకా పొత్తిళ్లలో వున్న చిట్టితల్లే అనుకుంటున్నారా? మీరు వంగి వుంటే మీ వీపు మీద ఏనుగెక్కిన బుడుతే అనుకుంటున్నారా? అదిప్పుడు ఇరవై ఏళ్ల పడుచు అనే విషయం మర్చిపోతున్నారు'' మందలించింది శ్రీమతి.

కమఠనాధంగారికి ఇప్పుడు బల్బు వెలిగింది.

''ఓహో! మనమ్మాయికి ఆ క్షీరాబ్ధిశయనం మీద మనసుంది అన్నమాట'' అన్నారు.

''ఔనండీ! దానికి మనసున్నవాడితో పెళ్లి చేస్తే దాని జీవితమూ బావుంటుంది. ఊళ్లోనే ఉద్యోగం, బీద కుటుంబంలోంచి వచ్చినవాడూ అవడంవల్ల మనమ్మాయిని పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాడు. అణకువ గానూ వుంటాడు'' అంది సతీమణి.

''సరే సరి. రేపు కబురుపెట్టి అప్లికేషన్ తెప్పించు'' అన్నారు కమఠనాధంగారు.

★★★

కమఠనాధంగారి ఆధీనంలో వున్న వేరొక ఆఫీసులో టెంపర్‌వారీ గుమస్తాగా జాయినయ్యేడు క్షీరాబ్ధిశయనం.

తను మొదటి జీతం అందుకున్నాక జనవరి ఒకటవ తేదీని డైరెక్టర్ కమఠనాధంగారింటికి ఓ ఏపిల్ పళ్ల బుట్టతో వెళ్లేడు క్షీరాబ్ధిశయనం.

ప్రతి జనవరి ఫస్టుని 'కాకా'సురులు చేసే పని ఇదే. ఆనాడు శ్రీరామచంద్రుడు కాకాసురుని చంపేయకుండా కుడి కన్నొక్కటే తీసుకోవడంవల్ల వాడి సంతానం ప్రభుత్వ శాఖల్లో విస్తరించిపోయింది.

''మీకూ మీ కుటుంబ సభ్యులకీ చాలా రుణపడి వున్నానండీ. మీ రుణం ఎలా తీర్చుకోవాలో బోధపడ్డం లేదు'' అన్నాడు క్షీరాబ్ధిశయనం.

''సర్లేవోయ్! నా రుణం ఎలా తీర్చుకోవాలో హెడ్‌క్లర్కు హేమరాజు చెబుతాడు. వెళ్లిరా'' అన్నారు కమఠనాధంగారు.

కమఠనాధంగారు ఇలా అనగానే క్షీరాబ్ధిశయనం గుండెలు గుభేలుమన్నాయ్. అతని మనస్సు పరిపరివిధాలా పోయింది. ఆఫీసులో తోటి గుమస్తాలు కొందరు తను ఈ ఉద్యోగం సంపాదించినందుకు డైరెక్టర్‌గారికి ఏమాత్రం ఆమ్యామ్యా సమర్పించుకున్నావని అడిగారు. కనీసం పాతికవేలైనా ఇవ్వందే ఈ ఉద్యోగం రాదే? అన్నారు కొందరు.

నేనేమీ ఇవ్వలేదు మొర్రో అని ఎంత మొత్తుకున్నా నమ్మి చావరే తోటి ఉద్యోగులు?

తనకొచ్చే రెండువేలలోనూ ఐదువందలు చొప్పున వాయిదాల పద్ధతిలో రికవరీ చేయించుకుంటూ పోతారేమో అనుకున్నాడు క్షీరాబ్ధిశయనం.

''మేము ఒక్కొక్కరం పాతికవేల నుండి నలభైవేలదాకా సమర్పించుకుంటే ఊరకనే తేరగా నీకు ఉద్యోగం వచ్చిందంటే నమ్మమంటావా? చెవిలో పువ్వెట్టకు?'' అన్నాడో సహోద్యోగి.

''చెవిలో పెట్టింది మామూలు పువ్వా? కాలీఫ్లవర్ పెడుతున్నాడు?'' అన్నాడింకో గుమస్తా.

''ఈ టెంపరరీ గుమస్తాగిరీకి పాతికవేల నుండి నలభైవేలదాకా ఖర్చు పెట్టారా?'' చోద్యపడ్డాడు క్షీరాబ్ధిశయనం.

''అవును. కొంత సర్వీసు చేశాక తీసేసినా మునుముందు ఉద్యోగాల్లో ప్రిఫరెన్సుంటుందికదా అని ఆశ'' అన్నాడొక గుమస్తా.

''మేము నలభైవేలిచ్చినా మాకేమీ నష్టంలేదు'' అన్నాడింకో గుమస్తా.

లంచాల రూపంలో ఆ నష్టాన్ని మెల్లమెల్లగా భర్తీ చేసుకుంటున్నారేమో అనుకున్నాడు క్షీరాబ్ధిశయనం.

''అదెలాగో?'' తెలుసుకోగోరేడు.

''ఈ భూమండలం మీద మాలో తలొకరికీ ఒక్కొక్క పెళ్లాం పుట్టే వుందికదా? ఆ పెళ్లాల తల్లిదండ్రులక్కాదా ఈ శిక్ష?'' అన్నాడో గుమస్తా సోదరుడు.

క్షీరాబ్ధిశయనానికి ఇప్పుడర్థమయింది. తమక్కాబోయే మామగార్లనుండి తాము ఉద్యోగాలు సంపాదించడానికి పెట్టిన ఖర్చుని కట్నం రూపంలో గుంజుతారన్నమాట!

★★★

డైరెక్టర్ కమఠనాధంగారి తరఫున హెడ్‌క్లర్కు హేమరాజు వేంచేసాడు క్షీరాబ్ధిశయనం ఇంటికి.

క్షీరాబ్ధిశయనం తల్లి స్టూల్ చూపెట్టి కూర్చోమంది

హేమరాజుని.

''చూడండమ్మా! కమఠనాధంగారు తన కుమార్తె సరసిజాన్నిచ్చి మీ అబ్బాయి కాళ్లు కడుగుదామనుకుంటు న్నారు. మీ ఆమోదం తెలుపమని నన్ను పంపేరు'' అన్నాడు హేమరాజు.

''బాబూ! అంత పెద్ద హోదాలో వున్న అధికారిగారికి మాది తగిన సంబంధం కాదు బాబూ! మేము బీద వాళ్లం. ఏ ఇంజనీరో, డాక్టరో అయితే బావుంటుంది'' అంది క్షీరాబ్ధిశయనం తల్లి.

''అవన్నీ మా డైరెక్టర్ గారికి తెలియవా తల్లీ? వాళ్లమ్మాయి సరసిజం మీ అబ్బాయికి మనసిచ్చిందట. అందుకూ ఆయన కబరు పంపేరు'' అన్నాడు హేమరాజు.

ఇంతలో ఎవరో ఇద్దరు పెద్దమనుషులు క్షీరాబ్ధిబ్ధిశయనం ఇంట్లో అడుగు పెట్టారు.

హేమరాజుకి ఆ పెద్ద మనుష్యులిద్దర్నీ చూపిస్తూ ''చూడండి హెచ్సీగారూ! ఇదిగో ఈయన ఏలూరు నుంచి వచ్చారు. వాళ్లమ్మాయిని చేసుకుంటే ఏభైవేలి స్తామంటున్నారు. ఈ రెండో ఆయన అమలాపురం నుంచి వచ్చారు. అరవైవేలి స్తామంటున్నారు. ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తున్నాను'' అన్నాడు క్షీరాబ్ధిశయనం బుర్ర గోక్కుంటూ.




''ఓహో! ఈ మహానుభావుడికి గీర ఎక్కువైనట్టుందే'' అనుకున్నాడు హేమరాజు.

''చూడు క్షీరాబ్ధిశయనం! డైరెక్టర్‌గారు నీ దగ్గర ఒక్క పైసా కూడా పుచ్చుకోకుండా ఉద్యోగం వేయించారు. తోటి గుమస్తాలు ఒక్కొక్కరు ఎంత ఖర్చు పెట్టారో నీకు చెప్పే వున్నారు. ఆయన నీ దగ్గర పుచ్చుకునే ఫీజుకి బదులుగా నీకు ఉద్యోగం వేయించి పిల్లనిద్దామనుకుంటున్నారు'' అన్నాడు హేమరాజు.

''నిజమేననుకోండి హెచ్సీగారూ! సిరి వస్తూంటే మోకాలొడ్డినట్టు అవదా?'' అన్నాడు క్షీరాబ్ధిశయనం.

మొండివాడు రాజుకన్నా బలవంతుడన్నట్లు వీడితో వాదించి లాభంలేదని నిశ్చయించాడు హెడ్‌గుమస్తా.

★★★

ఓరోజు క్షీరాబ్ధిశయనం ఒంట్లో బావులేదని కాజువల్ లీవ్ పంపించాడు. ఆ రోజు మధ్యాహ్నామే ఆఫీస్ ఎటెండర్ ఓ కవరు పట్టుకొచ్చి క్షీరాబ్ధిశయనానికిచ్చి సంతకం చేయమన్నాడు.

''ఏవిటోయ్ ఇది? నా లీవ్ సేంక్షన్ చేసిన కాయితమా?'' అంటూ కవరు విప్పేడు క్షీరాబ్ధిశయనం.

''మీకు పర్మినెంట్‌గా లీవ్ సేంక్షన్ చేసేసేరండీ'' అన్నాడు ఎటెండరు.

తనకిచ్చిన ఊస్టింగ్ ఆర్డరది. క్షీరాబ్ధిశయనం ఆ కాయితాన్ని చూపించాడు వాళ్లమ్మకి గజగజ వణికిపోతూ.

తల్లీకొడుకులిద్దరూ ఆటోలో పరుగెత్తారు డైరెక్టర్ కమఠనాధంగారింటికి.

''బాబూ! మీ అమ్మాయినే మా కోడలుగా చేసుకుంటాను. మా పొట్ట కొట్టకండి బాబుగారూ'' బతిమాలింది క్షీరాబ్ధిశయనం తల్లి.

''అలా తోవలోకి రండి'' అన్నారు కమఠనాధంగారు.

మరో నెల్లాళ్లలో క్షీరాబ్ధిశయనం డైరెక్టర్ కమఠనాధంగారి అల్లుడయి అల్లుకుపోయాడు.

అల్లుడికిచ్చిన ఊస్టింగ్ ఆర్డర్ని ఎబేయన్సులో పెట్టేరు డైరెక్టర్‌గారు.

''ప్రాణం పోసే దేవుడికి ప్రాణం తీసే శక్తి కూడా వున్నట్టు, ఉద్యోగం ఇచ్చినవాడికి ఉద్యోగం ఊడబెరికే శక్తి కూడా వుంటుందని తెలిసినట్టులేదు పాపం డింభకుడు'' అనుకున్నారు కమఠనాధంగారు.

★